సాక్షి
కర్నూలు
శనివారం । 18 । మార్చి । 2023



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



అలరించిన సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలజగద్గురు సేవా సమితి ట్రస్ట్ వారు చేపట్టిన భక్తి ప్రవచనం, నృత్య ప్రదర్శన, హైదరాబాద్‌కు గాయకుల భక్తి సంగీత విభావరి అలరించింది.

ఉష్ణోగ్రతలు

కనిష్టం	19.1
గరిష్టం	33.4

న్యూస్‌రీల్

భయం వీడితే విజయం మీదే



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

కృష్ణగిరి: భయాన్ని వీడి ధైర్యంగా పరీక్షలు రాస్తే విజయం తప్పక వరిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి అన్నారు. కృష్ణగిరి జిల్లా పరిషత్, మెయిన్, కస్తూర్బా విద్యాలయంతోపాటు కంబాలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షలను జిల్లాలో 29వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. సమయాన్ని వృథా చేయకుండా వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. డీఈఓ వెంట ఎంఎంఎస్ కో–ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు వీరనాగప్ప, శ్యామల, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు




సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

కర్నూలు (టౌన్): స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు సంబంధించి 27 మంది సిబ్బంది బదిలీలు, పిల్లల వైద్య చికిత్సల సమస్యలు ఎస్పీకి వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ డీడీగా రమేష్‌బాబు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం(కడప) డీడీగా రమేష్‌బాబు నియమితులయ్యారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఫుల్ అడిషనల్ ఛార్జ్ డీడీగా నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రాంతీయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. డీడీగా, ఏడీగా ఆయన రెండు చోట్లా బాధ్యతలు నిర్వహించేలా ఆదేశాలు జారీ అయ్యాయి.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



వెల్దుర్తిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

వెల్దుర్తి: ఫ్యామిలీ డాక్టర్ కాంసెప్ట్‌తో పేదల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ బి రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం వెల్దుర్తి సచివాలయం 3, 1 పరిధిలో కొనసాగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమ లక్ష్యాలపై పురోగతిని ఫ్యామిలీ డాక్టర్ (104 వాహనం వైద్యులు) ఆనంద రావ్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి వద్దకు వెళ్లి మెరుగైన సేవలందించాలన్నారు.

ఇంటర్ విద్యార్థి డిబార్

కర్నూలు సిటీ: కోసిగి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడడంతో స్క్వాడ్ బృందం డిబార్ చేసింది. శుక్రవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 36,768 మంది విద్యార్థులకుగాను 35,471 మంది హాజరయ్యారు. మొత్తం 1,297 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి తెలిపారు.

అడ్మిషన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు అడ్మిషన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ స్కూళ్లలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు వచ్చే నెల 4వ తేదీ నాటికి ఐదేళ్లు, స్టేట్ సిలబస్‌ను అనుసరించే స్కూళ్లను ఎంపిక చేసుకోవాలనుకునే పిల్లలు ఈ ఏడాది జూన్ 1వ తేదీ నాటికి 5 ఏళ్లు పూర్తయి ఉండాలన్నారు. ప్రైవేటు పాఠశాలు పోర్టల్‌లో నమోదుకు ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఇచ్చారని, గతంలో 16వ తేదీ వరకు మాత్రమే ఉండేదన్నారు. విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే నెల 10వ తేదీ వరకు గడువు విధించారన్నారు.



ఇక హాయివేలు

'దారి'ద్ర్యాన్ని తొలగిస్తూ రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విరివిగా నిధులు మంజూరు చేస్తోంది. ప్రధాన నగరాలు, పట్టణాల మధ్య రాకపోకలను సులువు చేసే విధంగా జాతీయ రహదారులను సైతం తీర్చిదిద్దుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ పనులు చేపట్టేందుకు త్వరలోనే టెండర్లు పిలువనున్నారు. వీటి నిర్మాణం పూర్తయితే 'హాయి'వేలపై ప్రయాణం బడలిక లేకుండా సాగనుంది.

- రూ.2,516 కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి
- ఇందులో రూ.461 కోట్లతో భూసేకరణ
- 208.781 కిలోమీటర్ల మేర బాగుపడనున్న రహదారులు
- నెలన్నర లోగా నాలుగు రోడ్లకు టెండర్లు
- ఈ నెలాఖరుకు ఖరారు కానున్న సోమయాజులపల్లె – డోన్ రహదారి టెండర్లు
- రూ.43.35 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లకు కాలానుగుణ మరమ్మతులు



అభివృద్ధి చెందనున్న సోమయాజులపల్లె–డోన్ రోడ్డు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల రోడ్లను మెరుగు పరుస్తూనే ... మరో వైపు కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో ఐదు జాతీయ రహదారులను అభివృద్ధి చేయనుంది. ఈ ఐదు జాతీయ రహదారుల పనులు పూర్తి అయితే ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. మంజూరైన ఐదు జాతీయ రహదారుల పనులకు సంబంధించి మరో నెలన్నర రోజుల్లో నాలుగు పనులకు టెండర్లు ఆహ్వానించనుండగా, మరో పనికి సంబంధించిన టెండర్ ఈ నెలాఖరు నాటికి ఖరారు కానుంది. మొత్తం రూ.2516 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్ నంబర్: 167 కే, 765, 167 , 340బీలో 208.781 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు అభివృద్ధి చెందనున్నాయి. ఈ వ్యయంలో రూ.461 కోట్లను భూ సేకరణకు వెచ్చిస్తున్నారు. జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించి భూములను ఇచ్చిన రైతులకు పరిహారంగా ఈ నిధులను అందించనున్నారు.

మరమ్మతులకు అధిక ప్రాధాన్యం

జిల్లా పలు ఆర్అండ్‌బీ రోడ్లకు కాలానుగుణంగా మరమ్మతులు చేపట్టేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇప్పటికే ఈ పనులకు సంబంధించి రూ.43.35 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఈఎన్‌సీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పూర్తి అధ్వానంగా తయారైన రోడ్లను ఎంపిక చేసి ప్రతిపాదనలను రూపొందించారు. ఇందులో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు కూడా ఉన్నాయి. రాష్ట్ర రహదారులకు సంబంధించి 16 రోడ్లలో 102.668 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. ఆయా రోడ్లకు ప్యాచ్ వర్కులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్లను కూడా వేయనున్నారు. కర్నూలు – బళ్లారి, కోడుమూరు – ఎమ్మిగనూరు, బిల్లేకల్ – ఎమ్మిగనూరు, గుత్తి – పత్తికొండ (ఆదోని రోడ్డు), పెద్దతుంబలం – కోసిగి (హాల్వీ– రాంపురం రోడ్డు), మద్దికెర – పత్తికొండ, ఆలూరు – హోళగుంద (కర్ణాటక సరిహద్దు వరకు) తదితర రోడ్లను ఈ ప్రతిపాదనల్లో చేర్చారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన అనంతరం ఈ రోడ్ల పనులను ప్రారంభం కానున్నాయి.

అభివృద్ధి చెందనున్న హైవేల వివరాలు..

- సంగమేశ్వరం నుంచి నల్లకాల్వ (93/819 నుంచి 124/530 కిలోమీటరు) వరకు, వెలుగోడు నుంచి నంద్యాల (141/700 నుంచి 173/560 కి.మీల) వరకు మొత్తం రూ.776.17 కోట్లతో 62.571 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు జరగనున్నాయి. ఇందులో భూ సేకరణకు రూ.165 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- ప్రకాశం జిల్లాకు సంబంధించి దోర్నాల నుంచి కుంట (244/0 నుంచి 268/700 కి.మీల) వరకు మొత్తం రూ.244.83 కోట్లతో 24.20 కి.మీల మేర పనులు చేపట్టనున్నారు. ఇందులో భూసేకరణకు రూ.51 కోట్లు వెచ్చించనున్నారు.
- నంద్యాల నుంచి జమ్మలమడుగు (186/02 నుంచి 248/010 కి.మీల) వరకు మొత్తం రూ.690 కోట్లతో 62.01 కి.మీల మేర పనులు చేయనున్నారు. ఇందులో భూసేకరణకు రూ. 135 కోట్లు వెచ్చించనున్నారు.
- రూ.155 కోట్లతో 7 కి.మీల మేర ఆదోని బైపాస్ రోడ్డు పనులు చేపట్టనున్నారు.
- సోమయాజులపల్లె నుంచి డోన్ (0/0 నుంచి 53/0 కి.మీల) వరకు రూ.650 కోట్లతో 53 కి.మీల మేర రోడ్డును వేయనున్నారు. ఇందులో భూసేకరణకు రూ.110 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ రోడ్డు పనులకు సంబంధించిన టెండర్ ఈ నెలాఖరు నాటికి పూర్తి కానుంది.

నాలుగు రోడ్లకు త్వరలోనే టెండర్లు



జిల్లాకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన నాలుగు రోడ్ల పనులకు నెలన్నర రోజుల వ్యవధిలోనే టెండర్లను ఆహ్వానించేందుకు చర్యలు చేపట్టాం. టెండర్లు పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయి. సోమయాజులపల్లె – డోన్ జాతీయ రహదారికి సంబంధించిన టెండర్ ఈ నెలాఖరు నాటికి ఖరారు కానుంది. ఈ పనులు పూర్తి అయితే ఇటు వైఎస్సార్, అటు ప్రకాశం జిల్లాలకు మన జిల్లా నుంచి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

– ఏ ఇందిర, ఈఈ, ఎన్‌హెచ్ కర్నూలు

జగనన్న కాలనీల్లో అన్ని సదుపాయాలు

- మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- ఓర్వకల్లు లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్ కోటేశ్వరరావు



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో అన్ని సదుపాయాలను సమకూర్చాలని అధికారులను కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశించారు. ఓర్వకల్లులోని హౌసింగ్ లేఅవుట్‌ను, ఏపీ మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 31 లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అప్రోచ్ రోడ్లను పూర్తి చేసి, ముఖ ద్వారాలను నిర్మించాలన్నారు. కాలనీలో డ్రైనేజీ కాల్వలు, తాగునీటి వసతులను పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీ చుట్టూ కంచె వేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో ప్రతి ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓర్వకల్లులో ఇసుక నిలువ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం స్థానిక మోడల్ స్కూల్‌ను సందర్శించి, పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్నత విద్యకు పదో తరగతి కీలకమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉపాధ్యాయులు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ నాగరాజు, డీటీ సతీష్, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల ఇంజినీర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జోషిలా వాట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాతకు 'అకాల' నష్టం

- కల్లూరులో 40.2 మిమీ వర్షపాతం
- మార్కెట్ యార్డులో నీట మునిగిన వాము పొట్టు
- కర్నూలు మండలంలో దెబ్బతిన్న అరటి, బొప్పాయి తోటలు



కర్నూలు మార్కెట్ యార్డులో తడిసిన వాము


కర్నూలు(అగ్రికల్చర్): ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కురిసిన అకాల వర్షాలతో రైతులకు నష్టం వాటిల్లింది. జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు 13 మండలాల్లో వర్షాలు కురిశాయి. కల్లూరులో అత్యధికంగా 40.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కర్నూలు రూరల్‌లో 10.2, కర్నూలు అర్బన్‌లో 9.8, కోడుమూరులో 7.8, కృష్ణగిరిలో 7.2, సి.బెళగల్‌లో 6.4, వెల్దుర్తిలో 5.2 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా నగటున 3.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అకాల వర్షంతో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాము పొట్టు పూర్తిగా తడిచి పోయింది. పలు ప్రాంతాల్లో పొలాలు, కల్లం దొడ్లలో ఆరబెట్టిన ఎండుమిర్చి నీటి పాలైంది. గాలుల తీవ్రతకు రబీలో సాగు చేసిన వరి నేల వాలింది. కర్నూలు మండలంలో అరటి, బొప్పాయి తోటలు 10 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. రానున్న 24 గంటల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు...

నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. ఒకే రోజు జిల్లా మొత్తం మీద నగటున 16 మి.మీ. వర్షపాతం నమోదైంది. పాములపాడు, మహానంది, కొత్తపల్లి మండలాలు మినహా అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా కోవెలకుంట్లలో 84 మి.మీ. వర్ష పాతం నమోదైంది. ఉయ్యాలవాడలో 47.2, శిరివెళ్లలో 33, ఆళ్లగడ్డలో 30.8, బనగానపల్లెలో 30.2, దొర్నిపాడులో 28.8, గడివేములలో 22.4, రుద్రవరంలో 21.2, బేతంచెర్లలో 19.8, వెలుగోడులో 19.2 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. అకాల వర్షాలతో 3,193.40 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 3,355 మంది రైతులకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. రబీలో సాగు చేసిన వరి, మినుము, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.

ఉగాది మహోత్సవాలకు వేళాయె

- కన్నడ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకారం, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు
- భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం



ఉత్సవాల్లో స్వామి అమ్మవార్లకు వాహనసేవ, అలంకరణలు ఇలా..

తేదీ	స్వామిఅమ్మవార్లకు వాహన సేవ	అమ్మవారికి అలంకరణ
19న	భృంగివాహనసేవ	మహాలక్ష్మి
20న	కైలాసవాహనసేవ	మహాదుర్గ
21న	నందివాహనసేవ	మహాసరస్వతి , ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు
22న	ఉగాది, పంచాంగ శ్రవణం, రథోత్సవం	రమావాణిసేవిత రాజరాజేశ్వరి
23న	అశ్వవాహనసేవ	భ్రమరాంబాదేవి నిజాలంకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముందే కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు శ్రీగిరికి చేరుకుంటున్నారు. దీంతో క్షేత్రం కన్నడ భక్తులమయమైంది. ఐదు రోజుల పాటు జరుగనున్న మహోత్సవాలను విజయవంతం చేసేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అన్ని విభాగాల అధికారులతో పలుమార్లు సమావేశాన్ని నిర్వహించి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు, ఐటీడీఏ, అటవీ, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉగాది మహోత్సవాలు ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా వేదస్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, చండీశ్వరపూజ, కంకణపూజ, ఋత్విగ్వరణం, దీక్షా కంకణధారణ, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తుహోమం, మండపారాధన, రుద్రకలశస్థాపన తదితర పూజలు నిర్వహిస్తారు. అలాగే భ్రమరాంబాదేవి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, నిత్యహవనములు జరిపిస్తారు.

శాస్త్రోక్తంగా స్వామిఅమ్మవార్ల కైంకర్యాలు..

వేడుకల్లో కైంకర్యాలన్నీ శాస్త్రోక్తంగా ఎలాంటి లోపం లేకుండా పరిపూర్ణంగా జరగాలని ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులను, స్థానాచార్యులను ఈఓ ఆదేశించారు. సమయానుకూలంగా ఆయా పూజాదికాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా!



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు షాఫియా. కర్నూలు మండలం నందనపల్లి గ్రామానికి చెందిన పొదుపు మహిళ. ఈమె పార్వతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. మూడో విడతలో వైఎస్సార్ ఆసరా కింద గ్రూపు మొత్తానికి రూ.1,25,783 రానుంది. వ్యక్తిగతంగా ఈ మహిళకు ఆసరా కింద రూ.11,435 లబ్ధిచేకూరనుంది.



ఈ చిత్రంలోని మహిళ పేరు జి.వరలక్ష్మి, నందవరం గ్రామానికి చెందిన పొదుపు మహిళ. బందుసుధ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. వైఎస్సార్ ఆసరా కింద సంఘానికి నాలుగేళ్లలో రూ.4,52,700 వస్తున్నాయి. ఏటా రూ.1,13,175 విడుదల అవుతున్నాయి. ఈమెకు మొదటి విడతలో రూ.11,318, రెండో విడతలో రూ.11,318 వచ్చాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను దుర్వినియోగం చేయకుండా ఈమె కిరాణం షాపు ఏర్పాటు చేసుకున్నారు.

- నాలుగు విడతల్లో రూ.904.11 కోట్లు విడుదల చేయడమే లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో 5,16,110 మంది మహిళలకు లబ్ధి
- రెండు విడతల్లో రూ. 659.35 కోట్లు విడుదల
- ఈ నెల 25న మూడో విడత విడుదల కానున్న నిధులు
- ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధికారులు



కర్నూలు(అగ్రికల్చర్): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద 2019 ఏప్రిల్ 1 నాటికి గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ అప్పు నిల్వను ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 3,8211 సంఘాలకు చెందిన 3 ,96,443 మంది మహిళలకు రూ.904.11 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 13,319 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,19,667 మంది మహిళలకు రూ.327.5 కోట్లు నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. ఇప్పటికే రెండు విడతలుగా రూ. 659.35 కోట్ల నిధులను విజయవంతంగా విడుదల చేసింది. రెండు విడుతల్లో గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.454.35 కోట్లు, అర్బన్ ప్రాంతాలకు మహిళలకు రూ.205 కోట్లు విడుదలయ్యాయి.

ఉమ్మడి జిల్లాకు రూ.310.33 కోట్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులను ఈ నెల 25వ తేదీన పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. మూడో విడతలో ఉమ్మడి జిల్లాలో డీఆర్‌డీఏ–వైకేపీకి సంబంధించి రూ.226.93 కోట్లు, మెప్మాకు సంబంధించి రూ.83.40 కోట్లు... మొత్తంగా రూ.310.33 కోట్లు విడుదల కానున్నాయి. కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 17,316 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,73,334 మంది మహిళలకు రూ.90.83 కోట్లు జమకానున్నాయి. నంద్యాల జిల్లాలో 20,987 సంఘాలకు చెందిన 2,09,870 మంది మహిళలకు రూ.136.10 కోట్లు విడుదల కానున్నాయి. అర్బన్ ప్రాంతాలకు సంబంధించి కర్నూలు జిల్లాలో రూ.51.81కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.31.93 కోట్లు విడుదల కానున్నాయి.

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు

వైఎస్సార్ ఆసరా నిధుల విడుదలకు ముందు, నిధుల విడుదల తర్వాత వివిధ దశల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపైన ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. నిధుల విడుదలకు ముందు మొదటి విడతలో వైఎస్సార్ ఆసరా అమలు చేయడంలో ప్రధాన ఉద్దేశాన్ని డీఆర్‌డీఏ–వైకేపీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమం శుక్రవారం నాటితో ముగిసింది. రెండో విడత కార్యక్రమాలు ఈ నెల 18 నుంచి మొదలు కానున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై సుస్థిర జీవనోపాధుల ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తారు. దిగ్గజ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తారు. మూడో విడత కార్యక్రమాలు ఈ నెల 21, 23, 24 తేదీల్లో జరుగుతాయి. గ్రామ, వార్డు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5వతేదీ వరకు వైఎస్ఆర్ ఆసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. మండలాలవారీగా నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

26 నుంచి 'ఆసరా' ఉత్సవాలు



పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేస్తారు. రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5 వరకు ఆసరా ఉత్సవాలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–వెంకటసుబ్బయ్య, పీడీ, డీఆర్‌డీఏ–వైకేపీ, కర్నూలు

గిరిజన గురుకుల విద్యార్థినులు క్షేమం

• జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల/పాణ్యం: నెరవాడ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు క్షేమంగా ఉన్నారని, వారి ఆరోగ్యం కుదుట పడిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. అస్వస్థతకు గురై నంద్యాల సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో అస్వస్థతకు గురైనట్లు సమాచారం రాగానే రెవెన్యూ, ఆరోగ్య అధికారులను అప్రమత్తం చేశామన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించామన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా 44 మంది అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 31 మంది డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన 13 మంది విద్యార్థులను కూడా సాయంత్రం డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాలు, తాగునీరు శ్యాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని రిపోర్టులు రాగానే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

పాఠశాలలో విచారణ
నెరవాడ గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేస్తామన్నారు. విద్యార్థినులకు చికిత్స అందించేందుకు ఐటీడీఏ నుంచి వైద్యులు వచ్చారన్నారు. బాలికలు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ మేరీ సలోమి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ఎమ్మెల్యే ఆరా



గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున అమరావతిలో ఉన్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై వాకబు చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావుతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ వెంకటరమణను కోరారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఐటీడీఏ అధికారులను అడిగి వివరాలు తెలుసుకుని, విచారణ వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్యం కోసం ముగ్గురు డాక్టర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, మరో ముగ్గురు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఫోన్ ద్వారా ఆయన 'సాక్షి'కి చెప్పారు.

19న మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): గుంటూరులోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు సీనియర్ మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ. రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన జిల్లా మహిళా కబడ్డీ క్రీడాకారిణులు నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికయిన వారు ఈనెల 23 నుంచి 26 వరకు హర్యానాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

25,26 తేదీల్లో ట్రాన్స్‌పోర్టు జాత



సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): ప్రజా, సరుకు రవాణా చేసే డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25, 26 తేదీల్లో చేపట్టే ట్రాన్స్‌పోర్టు జాతను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జీఓ 21 వల్ల మోటార్ రంగం కుదేలవుతోందన్నారు. పోలీసులు, ఆర్టీఏ అధికారులు వాహనదారులపై విపరీతంగా చలానాలను రాస్తున్నారన్నారు. అంతేకాక డ్రైవర్లకు జీవన వేతనాలు లేకపోవడంతో వారు కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. రవాణా రంగానికి సంబంధించిన అనేక సమస్యల పరిష్కారం కోసం కార్మికులను చైతన్యం చేసేందుకు ట్రాన్స్‌పోర్టు జాతను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.రాధాకృష్ణ, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

19న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో అండర్–19 విభాగంలో బాలుర క్రికెట్ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాల్గొనవచ్చన్నారు. 2004 సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు.

పోస్టల్ పాలసీలు వినియోగించుకోండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ సెక్షన్‌లలో పనిచేస్తున్న కార్మికులందరు తప్పనిసరిగా పోస్టల్ పాలసీలను చేయించుకోవాలని నగర పాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్ శాఖల్లో పనిచేస్తున్న దాదాపు 1500 మంది కార్మికులకు పోస్టల్ పాలసీలు నమోదు చేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు భారం కాకుండా నగరపాలక సంస్థ ప్రతి కార్మికుడి తరఫున రూ.400లు ప్రీమియం చెల్లించి పాలసీ చేయిస్తుందన్నారు. తద్వార అనుకోకుండా జరిగే ప్రమాదాల్లో ఆ కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

కర్నూలు(లీగల్): న్యాయవాది వి.రామకృష్ణ (43) మృతి పట్ల కర్నూలు న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఆర్ కృష్ణ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కోర్టులో సంతాప సభ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో గురువారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందడం బాధాకరమని వారు పేర్కొన్నారు. సంతాప సభలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, అదనపు జిల్లా జడ్జీలు వి.శ్రీనివాసకుమార్, భూపాల్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, వెంకటరమణ, సబ్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు పాల్గొన్నారు. పలువురు న్యాయవాదులు ఆయన స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పీడీపీ ఉద్యోగుల నిరసన

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణ శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ కర్నూలు–1 డిపో కార్యదర్శి ఆర్‌పీఎం రావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపో ముందు ఆ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల ఓటీని వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మద్దిలేటి, చంద్ర, విజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కబ్జా,బలగం, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ అఫ్ ది గాడ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కబ్జా, సార్, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, గనా
వెంకటేష్‌సినీ కాంప్లెక్స్: సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : తూ జూతీ మై మక్కర్, షాజమ్ ఫరీ అఫ్ ది గాడ్స్
భరత్ కాంప్లెక్స్: పులి ది నైన్‌టీన్త్ సెంచరీ, వినరో భాగ్యము విష్ణు కథ
రాజ్ : కబ్జా
శ్రీరామ : షాజమ్ ఫరీ అఫ్ ది గాడ్స్
విజయ : పులి ది నైన్‌టీన్త్ సెంచరీ



● ఈ చిత్రంలో ఆహార పదార్థాలు వడ్డిస్తున్న వారు పంచాయతీ రాజ్ ఇంజినీర్ల అన్నదాన కమిటీ సభ్యులు. పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ కె.విజయభాస్కర్ ఆధ్వర్యంలో గర్జేయపురం గ్రామంసమీపంలోని హెచ్‌ఎన్ఎస్ఎస్ కెనాల్ వద్ద శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న కర్ణాటక భక్తులకు ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. ఇంజినీర్లు సునీల్, నాగభూషణం, మద్దులేటి, రమణలతో పాటు పీఆర్ ఎస్ఈ, నంద్యాల, కర్నూలు, ఆదోని ఈఈల సహకారంతో గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విజయభాస్కర్ పేర్కొన్నారు.



● ఈ చిత్రంలో అల్పాహారం, ఫలహారాలు అందజేస్తున్న వారు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సేవా సమితి సభ్యులు. 2010 నుంచి వీరు మండ్లెం గ్రామ సమీపంలో టెంట్ వేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా సమితి అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ ఆధ్వర్యంలో సభ్యులు రత్నమ్మ, జనార్దన్, శ్రీకర్, మాలతి, కమలమ్మ, వరలక్ష్మి, శోభన్‌బాబు, జ్యోతిర్మయి, శ్రీనివాస్, మండ్లెం సామన్నలు శివభక్తులకు వివిధ రకాల పండ్లు, పెరుగన్నం, చెరుకు గడలు, క్యారెట్, డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి హాస్పిటల్ వారు మందులు అందజేస్తున్నారు. బంధువులు, స్నేహితులు, మండ్లెం గ్రామస్తుల సహకారంతో గత 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నీలిమ వెల్లడించారు.

భక్తి మార్గంలో సేవా పరిమళాలు

- శ్రీశైల పాదయాత్ర భక్తులకు సేవా సంస్థల సపర్యలు
- ఆహార పదార్థాలు, ఫలహారాలు అందిస్తున్న వలంటీర్లు
- వైద్య శిబిరాల నిర్వహణ
- ఔదార్యాన్ని చాటుతున్న స్వచ్ఛంద సేవా సంస్థలు



● ఈ చిత్రంలో ఆహార పదార్థాలు అందజేస్తున్న వారు వివేకానంద స్టడీ సర్కిల్ వలంటీర్లు. జి.పుల్లారెడ్డి కళాశాలకు సంబంధించిన ఈ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ నాగఫణి శాస్త్రి మార్గదర్శకత్వంలో 2009 నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అల్పాహారం, తేనీరు, మజ్జిగ, అందజేస్తున్నారు. ప్రాథమిక చికిత్స చేయించడంతో పాటు కాళ్ల నొప్పులు పోయేందుకు ఆయిల్ మసాజ్ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం బొల్లవరం, నల్లమల అటవీ ప్రాంతం సమీపంలోని వీరభద్ర స్వామి ఆలయం వద్ద కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు సపర్యలు చేస్తున్నారు. మధుసూదన్‌రావు, దేవకిలతో పాటు కళాశాల అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు సాయి చరణ్, భార్గవ, శ్రీ చక్ర, ప్రణీత్, శరత్, స్వరూప్, ప్రేమ్‌సాయిల సహాయ సహకారాలతో సేవ చేస్తున్నట్లు నాగఫణిశాస్త్రి పేర్కొన్నారు.

కర్నూలు కల్చరల్: శ్రీశైలం ఆధ్యాత్మిక దారిలో సేవా పరిమళాలు వెదజల్లుతున్నాయి. కన్నడిగుల భక్తికి తెలుగు వారి సేవా తత్పరత తోడయ్యింది. శ్రీశైల భ్రమరాంబా దేవి పుట్టింటి వారైన కర్ణాటక వాసులు ఉగాది పర్వదినాన తమ ఆడపడుచుకు ఒడి బియ్యం తీసుకెళ్లడం ఆనవాయితీ. ఇందుకోసం కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ తమ భక్తిని చాటుతూ శ్రీశైలం చేరుకుంటారు. వారికి నడక మార్గంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందిస్తూ సపర్యలు చేస్తున్నాయి. దారి పొడవునా తాగునీరు మొదలుకొని మజ్జిగ, ఆహారం, పండ్లు అందజేస్తున్నారు. కాళ్లకు గాయాలైతే ప్రథమ చికిత్స చేయించి మందులు అందజేస్తున్నారు. కాళ్లకు నొప్పులు పోయేందుకు మర్దన చేస్తూ వారి భక్తిలో వీరు సేవ ద్వారా పాలు పంచుకుంటున్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కార్మికుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడంలేదన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. రైతులకు మద్దతు ధర ఇవ్వాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలనే పలు డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.రామాంజనేయులు, రాధాకృష్ణ, అంజిబాబు పాల్గొన్నారు.

అవసరమైన వారందరికీ పరీక్షలు చేయాలి

- డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

కల్లూరు: అవసరమైన వారందికీ రక్త పరీక్షలు చేసి వాటి ఫలితాల ఆధారంగా మందులు ఇవ్వాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య మెడికల్ ఆఫీసర్లకు సూచించారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సచివాలయం–1లో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులను ప్రసవానికి ముందే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాలని సూపర్ వైజర్లను, ఆరోగ్య, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోని సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే తన నివాసంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన లింగంకు రూ.10లక్షలు, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన దిగువపాడు గ్రామానికి చెందిన మరో వ్యక్తికి రూ.1.20 లక్షలు మంజూరు కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ–2 సెహమ్మా, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యుడు రామ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

సి.బెళగల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని డీఆర్‌డీఏ – వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. మనబడి నాడు నేడు పనులను పరిశీలించారు. ఉపాధ్యాయినుల హాజరు, పాఠ్యాంశ ప్రణాళికలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. బాగా చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అంతకుముందు స్త్రీ శక్తిభవన్‌ను తనిఖీ చేశారు. డీఆర్‌డీఏ చేపట్టిన పథకాల అమలు, రుణాల చెల్లింపులు, లబ్ధిదారుల అంశాలను అకౌంటెంట్ గోవిందును అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఓర్వకల్లు: ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలలో భాగంగా పీఎండీఎస్ గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజుల పాటు భూమిని కప్పి ఉంచే పద్ధతిలో పీఎండీఎస్ వేయాలని స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగుల వార్డులు, రికార్డులను పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు తగిన వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? వైద్యుల పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఏమైన సమస్యలున్నా, మరమ్మతులు చేయించాలన్నా, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి నిధులను ఖర్చు చేసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. వేసవి ఆరంభం అయ్యిందని, వడదెబ్బ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రోగులకు కావలసిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్లు, వీఆర్వో షేక్షావలి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్యానికి మించి పనులు కల్పించాలి

గోనెగండ్ల: ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యానికి మించి పనులు కల్పించాలని డ్వామా పీడీ అమరనాథ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో జరుగుతున్న కాలువలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వలస వెళ్లకుండా ఉండేందుకు గాను గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధి పనుల్లో రోజుకు కనీస వేతనం రూ.253 పడేటట్లు పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. బ్యాంక్ అకౌంట్, జాబ్‌కార్డుకు ఆధార్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని కూలీలకు సూచించారు. చేసిన పనులకు వేతనాలు వెంటనే మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే పండ్ల తోటలు, మునగ మొక్కలు వేసుకునేందుకు ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే జిల్లాలో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచి వలసల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో సిబ్బంది ఎవరు నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

– 31 వరకు మాత్రమే అవకాశం

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలో పన్నుదారులు తమ ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీని మాఫీ చేసినట్లు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 2022–2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను బకాయిదారులకు ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. ఈ అవకాశం కేవలం మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు.

అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

కర్నూలు (టౌన్): ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత–2023 అవార్డుల కోసం ఈ నెల 22వ తేదీలోపు నగరపాలక కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం–మన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ అవార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు. వ్యక్తిగత, స్వయం సహాయక చిన్న తరహా, సామాజిక మరుగు దొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రం, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం వంటి విభాగాల కింద కృషి చేస్తున్న మహిళలు అర్హులన్నారు. ఎంపికైన వారికి వచ్చే జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డులు అందజేస్తామని కమిషనర్ తెలిపారు.

షూ మార్ట్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు (టౌన్): స్థానిక భూపాల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రాఫిట్ షూ మార్ట్‌లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం పొగలు రావడంతో చుట్టు పక్కల ఉన్న షాపుల వాళ్లు స్పందించి వెంటనే మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని రెండో పట్టణ పోలీసులు వెల్లడించారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి


గర్భిణికి సూచనలు ఇస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జాతీయ నులిపురుగుల నిర్మూలనలో భాగంగా గర్భిణీలూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం శరీన్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్ర వేసుకోవాలన్నారు. కడుపులో నులిపురుగులు ఉంటే శరీరం తెల్లగా పాలిపోవడం, చేతులు, కాళ్లలో విపరీతమైన దురద వస్తుందని, దేహంపై ఎక్కడైనా చర్మంపై అలర్జీ వస్తుందన్నారు. దీనివల్ల మనిషి నీరసించిపోవడం, నిస్సహాయంగా ఉండటం, కళ్లు తిరిగి పోవడం వంటివి జరుగుతాయన్నారు. కంటికి కనిపించనంత పరిమాణంలో ఉండే నులిపురుగులు మనం తీసుకునే ఆహారం ద్వారానే పొట్టలోకి చేరతాయన్నారు. వీటి నివారణకు వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలని, ఆహారం తీసుకునేముందు, మలవిసర్జన తర్వాత చేతులను తప్పక సబ్బుతో శుభ్రపరచుకోవాలని, ప్రతి ఆదివారం గోళ్లు కత్తిరించుకోవాలని, మాంసం మొదలైన పదార్థాలను బాగా ఉడికించి తినాలని, ఇతర జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబుస్సుమ్, సచివాలయ ఆరోగ్య కార్యకర్త కల్యాణి, ఎస్‌వో హేమసుందరం, శివకుమార్, ఖలీల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం హర్షణీయం


మ్యూజికల్ చైర్స్ క్రీడలో పోటీ పడుతున్న మహిళలు

కర్నూలు (టౌన్): మహిళలు అన్ని రంగాలతోపాటు క్రీడల్లోనూ పురుషులకు దీటుగా రాణించడం హర్షణీయమని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం సీఈఓ రమణ అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మహిళలకు క్రీడా పోటీలు ప్రారంభించారు. టగ్–ఆఫ్–వార్, షాట్ పుట్, స్పీడ్ వాక్, మ్యూజికల్ చైర్స్, 400 మీటర్ల పరుగు పందెం వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు పాల్గొన్నారు. కాగా శనివారం(నేడు) స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బ్రెస్ట్ క్యాన్సర్, హిమోగ్లోబిన్ లెవల్స్, మహిళలు– ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సులు, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు/హాజరైన వివిధ శాఖల అధికారులు

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాలను నివారించాలని, ఇందులో భాగంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ముందుగా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నెల రోజుల్లోపు కర్నూలు నగరంలోసీసీ కెమెరాల మరమ్మతు పనులు పూర్తి కావాలన్నారు. రోడ్లపై గుంతలు ఉంటే పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారికి ఆరోగ్యశ్రీ కింద మెరుగైన ఉచిత చికిత్స అందించాలని కోఆర్డినేటర్ డాక్టర్ రఘుకు సూచించారు. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియమ,నిబంధనలపై వీడియో, ఆడియోల ద్వారా ప్రచారం చేయాలన్నారు. కాగా ఓర్వకల్ సమీపంలో అండర్‌పాస్ నిర్మాణ కోసం వేసిన డిజైన్ల పనులు ఎంతవరకు వచ్చాయని నేషనల్ హై వే అధికారులను ప్రశ్నించారు. అందుకు వారు స్పందించి డిజైన్లను ఎన్‌హెచ్ఏఐకు పంపామని, వారు పరిశీలన చేస్తున్నట్లు వివరించారు. సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఐరన్ బారికేడింగ్ పనులు పూర్తి చేయలేదని డీఎస్పీ, డీటీసీలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పనులు పూర్తి చేస్తామని హైవే అధికారులు బదులు ఇచ్చారు. నేషనల్ హైవే 44లో సోలార్ లైట్లను 8 చోట్ల ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఓర్వకల్ సమీపంలో జగనన్న కాలనీలోకి వెళ్లేందుకు ప్రస్తుతం నేరుగా హై వే నుంచి రహదారి ఉందని, అలా కాకుండా సర్వీసు రోడ్డు ద్వారా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బళ్లారి చౌరస్తాలో రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని మునిసిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆరా తీయగా ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమవుతున్నట్లు భార్గవ్‌తేజ వివరణ ఇచ్చారు. వెంకాయపల్లె ఎల్లమ్మ గుడి దగ్గర నాలుగు రోడ్ల నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయని ప్రశ్నించారు. అనంతరం 2023లో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు డీటీసీ శ్రీధర్ వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కోడుమూరు రూరల్: కాటి కాపరుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కాటికాపరుల గుంతలు తీసే బేగారుల సంఘం(కేజీబీఎస్) రాష్ట్ర కన్వీనర్ ఆనంద్ బాబు కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కాటికాపరుల మండల సమావేశంలో ఆనంద్‌బాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కాటికాపరులు ఐక్యం కావాలన్నారు. ఈనెల 20న విజయవాడలో జరిగే మహాధర్నాకు శ్మశానంలో పనిచేసే వారంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కాటికాపరుల గుంతలు తీసే బేగారుల సంఘం నాయకులు ఈశ్వరయ్య, ఇమ్మానేయులు, వీరస్వామి, బొజ్జన్న, ప్రకాశం, మాదన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. శుక్రవారం ఆయన సంతేపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కింద విద్యార్థులకు వండే ఆహారాన్ని ప్రతి రోజు నాణ్యంగా వండి పెట్టేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యేవిధంగా పాఠాలు బోధించాలన్నారు. అనంతరం రాగిజావ మెటీరియల్‌ను పరిశీలించి స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని హెచ్ఎంకు సూచించారు.

సచివాలయాల్లో 'స్పందన' నిర్వహించాలి

కోడుమూరు రూరల్: గ్రామసచివాలయాల్లో ప్రతిరోజు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయాలను ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేసి రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై చర్చించారు. సకాలంలో సేవలందించి ప్రజల మన్ననలను పొందాలని ఎంపీడీఓ సూచించారు. సిబ్బంది ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

క్లుప్తంగా

బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు ఆన్‌లైన్‌లో అనుమతి

● కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): 300 చదరపు మీటర్లలోపు బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మునిసిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..300 చదరపు మీటర్లలోపు బిల్డింగ్ ప్లాన్‌ల అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉందని, అందులో ఏమైనా సందేహాలు ఉంటే విజయవాడ మునిసిపల్ అధికారులను కలసి నివృత్తి చేసుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో 4 అర్బన్ లెవల్ బాడీస్, 25 మండలాల్లోని 484 గ్రామాల్లోని ప్రజలు ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ ప్లాన్ అనుమతులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

జనరల్ స్టోర్‌పై కేసు నమోదు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని మద్దూర్‌నగర్‌లో ఉన కృష్ణమూర్తి జనరల్ స్టోర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ స్టోర్‌లో నకిలీ ప్యారచూట్ కొబ్బరి నూనె డబ్బాలు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లాయి. చాలా కాలంగా ఈ వ్యాపారం సాగిస్తున్నారని, ఇక్కడ కొబ్బరి నూనె కొనుగోలు చేసిన కొనుగోలుదారులు ప్యారచూట్ కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అ కంపెనీకి చెందిన ప్రతినిధి సంతోష్ కుమార్ శుక్రవారం స్టోర్‌లో ప్యారచూట్ కొబ్బరి నూనె డబ్బాలను పరిశీలించాడు. అందులో నకిలీ ప్యారచూట్ కొబ్బరి నూనె డబ్బాలు ఉన్నట్లు గుర్తించి మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

నదితీరంలో మొసలి కలకలం

నందవరం: తుంగభద్ర నదీ తీరంలో మొసలి కలకలం రేపుతోంది. శుక్రవారం ఓ ఆవును తీవ్రంగా గాయపరిచింది. మండలంలోని జొహరాపురం గ్రామానికి చెందిన రైతులు ఉదయం 11 గంటల సమయంలో పశువులు మేపుకునేందుకు తుంగభద్ర నది ఒడ్డున పచ్చిక బయళ్ల వద్దకు వెళ్లారు. అక్కడి రాళ్ల పొదల్లో దాగున్న మొసలి గోవిందుకు చెందిన ఓ ఆవుపై విరుచుకుపడి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కాపరులు అక్కడి నుంచి మొసలిని తరిమికొట్టారు. మొసలి దాడితో గ్రామస్తులు ఆందోళనకు లోనవుతున్నారు.

గుండెపోటుతో కన్నడ భక్తుడి మృతి

ఆత్మకూరురూరల్: నల్లమల అటవీ మార్గంలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న ఓ కన్నడ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం బాగల్ కోట్ జిల్లా బిళ్గి గ్రామానికి చెందిన రాజు(45) తన కుటుంబ సభ్యులతో కలసి పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరాడు. గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత నాగలూటి వీరభద్రాలయం నుంచి మెట్ల మార్గంలో వెళ్తుండగా హఠాత్తుగా కుప్ప కూలిపోయాడు. కుటుంబీకులు అత్యవసర వైద్య సదుపాయం కోసం ప్రయత్నించినప్పటికీ నల్లమల అడవిలో సాధ్యం కాలేదు. అప్పటికే రాజు మృతి చెందినట్లు గుర్తించిన వారు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. నాగలూటి క్షేత్ర సమీపంలో అత్యవసర వైద్య సహాయం కోసం 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.



సంజామల మండలం అక్కంపల్లి సమీపంలో నేలవాలిన మొక్కజొన్న పంట



కోవెలకుంట్ల మండలం అమడాలలో నీట మునిగిన మిరపను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడ మండలం కొండుపల్లెలో నేల కూలిన విద్యుత్తు స్తంభాలు

ఉరిమిన మేఘం.. ఊహించని నష్టం

జిల్లాలో అకాల వర్షం బీభత్సం



ఆళ్లగడ్డ మండలం పాత కందుకూరులో నీట మునిగిన కందికట్టెను గట్టుకు చేర్చుతున్న మహిళ

- 8,099 హెక్టార్లలో పంటనష్టం
- మిరప, మొక్కజొన్న రైతులు కుదేలు
- రూ. కోట్లలో ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- కోవెలకుంట్లలో అత్యధికంగా 84 మి.మీ వర్షం
- పిడుగుపాటుకు వ్యక్తి మృతి
- దాదాపు వెయ్యికి పైగా జీవాలు మృత్యువాత



ఉయ్యాలవాడ మండలం ఇంజేడులో అరబోసిన మిరప వర్షానికి తడిచిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) కొండుపల్లెలో గాలివానకు నేలరాలి నీట మునిగిన మిరప

కోవెలకుంట్ల/ఆళ్లగడ్డ: వేసవి ప్రారంభంలో అకాల వర్షం అన్నదాతకు అపారనష్టం చేకూర్చింది. జిల్లాలో గురువారం రాత్రి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో మేఘాలు గర్జించాయి.. మెరుపులు భయపెట్టాయి. ఉన్నట్టుండి కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చాయి. చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. రేకులషెడ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. అకాల వర్షానికి రైతులు భారీగా నష్టపోయారు. జిల్లా మొత్తం మీద సగటున 16 మి.మీ. వర్షపాతం నమోదైంది. పాములపాడు, మహానంది, కొత్తపల్లి మండలాలు మినహా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కోవెలకుంట్లలో 84 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉయ్యాలవాడలో 47.2, శిరివెళ్లలో 33, ఆళ్లగడ్డలో 30.8, బనగానపల్లెలో 30.2, దొర్నిపాడులో 28.8, గడివేములలో 22.4, రుద్రవరంలో 21.2, బేతంచెర్లలో 19.8, వెలుగోడులో 19.2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లాలోని ఆయా మండలాల్లో 8,099 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలో 3,193 హెక్టార్లలో మిరప, 3,121 హెక్టార్లలో మొక్కజొన్న, 1,347 హెక్టార్లలో వరి, 221 హెక్టార్లలో మినుము, 54 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 67 హెక్టార్లలో కొర్ర, 20 హెక్టార్లలో ఆముదం, 76 హెక్టార్లలో కుసుమ, పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 3,469 హెక్టార్లలో పంటనష్టం సంభవించినట్లు అధికారులు ప్రాథమిక నివేదిక పంపారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పంటను కాపాడుకోగా దిగుబడులు చేతికందే సమయంలో అకాల వర్షం నీటి పాలు చేసింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసేందుకు శుక్రవారం ఉదయాన్నే వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించారు. వీలైనంత త్వరగా పంట నష్టం అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని చెప్పారు.

మిరప రైతు కంట కన్నీరు..

జిల్లాలో ప్రస్తుతం మిరప పంట కోత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దిగుబడులను కల్లాల్లో అరబోసుకోగా అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. దిగుబడులను కాపాడుకునేందుకు వీలులేకుండా పెనుగాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షంతో పంటంతా తడిసిముద్దైంది. అక్కడక్కడా కోత కోయకుండా ఉంచిన పంట సైతం నేలపాలైంది. అలాగే మొక్కజొన్న, మినుము, బొప్పాయి, నువ్వు, వరి, కంది తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. చాగలమర్రి, రుద్రవరం, గడివేముల, బండిఆత్మకూరు, మిడుతూరు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లో 3193.40 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 3,55 మంది రైతులు నష్టపోయారు. అలాగే రబీలో సాగు చేసిన వరి, మినుము, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.

విరుచుకుపడిన వడగండ్లు.. భయపెట్టిన పిడుగులు

జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి ఒక్కసారిగా ప్రారంభమైన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, మిడుతూరు, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో భారీగా వడగండ్లు పడటంతో రేకుల ఇళ్లకు చిల్లులు పడ్డాయి. వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పాత కందుకూరు గ్రామంలో ఒక్కొక్కటి పెద్దపెద్ద బండరాయిలా సుమారు 20 నుంచి 25 కిలోల బరువుతో ఆకాశంలో నుంచి నేలమీద పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అనేక మంది వర్షం తగ్గిన తరువాత వీటిని ఇళ్లలోకి తీసుకెళ్లారు. ఉయ్యాలవాడ మండలంలో పిడుగుపాటుకు దాదాపు 800 జీవాలు మృత్యువాత పడ్డాయి. వైఎస్ఆర్ జిల్లా, అనంతపురం జిల్లాలకు చెందిన గొర్రెల కాపరులు మేకలు, గొర్రెలను మేపుకోవడానికి 15 రోజుల క్రితం మండలంలోని ఆర్.పాంపల్లె, కొండుపల్లె, నర్వాయిపల్లె, హరివరం, తదితర గ్రామాలకు చేరుకోగా జీవాలు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. కోటి వరకు ఉన్నట్లు చెబుతున్నారు. శిరివెళ్ల మండలం మహదేవపురంలో పిడుగుపాటుకు గొర్రెలకాపరి తిరుపాటి ఆంజనేయులు (45) మృతి చెందాడు. ఇసుకపల్లె- నాగుల చెరువు పొలాల మధ్యలో జీవాలు మేపుతుండగా పిడుగు పడింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆంజనేయులు మృత్యువాతపడ్డాడు. సమీపంలో ఉన్న మరో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.



మిడుతూరు మండలం తలముడిపిలో నేలవాలిన అరటితోటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి



శిరివెళ్ల మండలం మహదేవపురంలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెల కాపరి తిరుపాటి ఆంజనేయులు



ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందిన జీవాలు



ఆళ్లగడ్డ మండలం పాత కందుకూరులో గాలివానకు నేల కూలిన మామిడి చెట్లు

టీచర్స్ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీదే

● ఎమ్మెల్సీగా ఎంవీ రామచంద్రారెడ్డి ఎన్నిక ● రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి



కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంవీ రామచంద్రారెడ్డి విజయం సాధించారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మధ్య నడిచింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. 169 ఓట్లతో రామచంద్రారెడ్డి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రకటించారు.

రౌండు రౌండులో ఉత్కంఠ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతి రౌండులోనూ ఉత్కంఠ కొనసాగింది. 25 వేల పైచిలుకు ఓట్లు పోలవగా.. ఇద్దరు అభ్యర్థులకు మాత్రమే 10 వేల మార్కు దాటింది. మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో పది మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. చివరకు ఎంవీ రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మిగిలారు. వాస్తవానికి పోలైన ఓట్లలో 50 శాతం సాధించిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. కానీ రెండో ప్రాధాన్యతలో కూడా ఎవరూ 50 శాతం ఓట్లు సాధించలేదు. ఈ దశలో నిబంధనల ప్రకారం విజేతను ప్రకటించవచ్చు. ఇందులో భాగంగానే 169 ఓట్ల ఆధిక్యత ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిని విజేతగా నిర్ణయించారు.

ఆసక్తిరేపిన ఎలిమినేషన్

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ అందరిలోనూ ఆసక్తి రేపింది. రామచంద్రారెడ్డి, ఒంటేరు మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ నెలకొనడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వస్తాయో, ఎవరిని విజయం వరిస్తుందోనని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూశారు. ముఖ్యంగా మూడోస్థానంలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని ఎలిమినేట్ చేసే క్రమంలో ఆయన బ్యాలెట్లలోని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగతా ఇద్దరు అభ్యర్థులకు కేటాయించే సమయంలో విజయం దోబూచులాడింది. ఈ ఓట్లలో ఎక్కువ శాతం ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వెళ్లడంతో ఆయన విజయం ఖాయమనుకున్నారు. కానీ చివరకు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక చూస్తే రామచంద్రారెడ్డికే ఆధిక్యత లభించింది. దీంతో ఆయన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ ప్రకటనతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో విజయోత్సాహం నెలకొంది.

సీఎం ఆశీస్సులతోనే విజయం

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని ఎం.వి.రామచంద్రారెడ్డి తెలిపారు. తన గెలుపునకు సహకరించిన వైఎస్సార్‌సీపీ పెద్దలు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లు శుక్రవారం జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్ చేతుల మీదుగా ఆయన డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. విద్యా సంస్కరణలు అమలు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేశారని, ఇలాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరని కొనియాడారు. గతంలో ఎమ్మెల్సీలుగా ఉన్నవారు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారన్నారు. తాను వారిలా కాకుండా ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

'తొలి ప్రాధాన్యత'లో అభ్యర్థుల వారీ ఓట్లు

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	6,853
కత్తి నరసింహారెడ్డి	4,162
అనిల్ ప్రసాద్‌రెడ్డి	3,212
జీవీ నారాయణరెడ్డి	1,345
ఎంవీ రామచంద్రారెడ్డి	8,846
అనిల్‌కుమార్‌రెడ్డి	186
ఎస్.మాధవరావు	354
రామశేషయ్య	187

(మిగతా నలుగురికి ఒక్కొక్కరికి 100 ఓట్లకంటే తక్కువగానే వచ్చాయి)

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితమిలా..

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
మొత్తం పోలైనవి	25,272
చెల్లని ఓట్లు	3,867
ఎంవీ రామచంద్రారెడ్డి	10,787
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	10,618
మెజారిటీ	169

విద్యుత్ శాఖకు వర్షం షాక్!

● రూ. 50లక్షల నష్టం

కర్నూలు(రాజ్‌విహార్): వర్షంతో విద్యుత్ శాఖకు భరీ నష్టం కలిగిందని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి కురిసిన వర్షాలు, ఈదురు గాలులు, ఉరుములు కారణంగా రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల, ఉయ్యాలవాడ, చాగలమర్రి ప్రాంతాల్లో దీని ప్రభావం అధికంగా ఉందని చెప్పారు. 33 కేవీ విద్యుత్ స్తంభాలు 70, 11 కేవీ స్తంభాలు రూ.50 విరిగి పడ్డాయని, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు బ్రేకర్లు, పీసీబీలు ధ్వంసమయ్యాయని, బనగానపల్లె సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద విద్యుత్ టవర్ కింద పడిపోయిందని, దీని తోడు ఎల్‌టీ స్తంభాలు, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో సమారు రూ.50లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఏడీఈలతో పాటు ఏఈలు, ఓ అండ్ ఎం సిబ్బంది రాత్రంతా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు.

ఉగాది ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



శ్రీశైలంలో భక్తులకు ఆహ్వానం పలుకుతున్న ఉగాది మహోత్సవాల స్వాగత తోరణాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈనెల 19 (ఆదివారం) నుంచి 23వ తేదీ వరకు జరిగే ఉగాది మహోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. తమ ఆడపడుచు శ్రీశైల భ్రామరీకి సారె సమర్పించేందుకు కర్ణాటకవాసులు భారీగా తరలివస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. పలు చోట్ల చలువ పందిళ్ల, విద్యుద్దీకరణ, తాగునీరు, తాత్కాలిక వైద్య శిబిరాలు, బాత్‌రూంలు, మరుగుదొడ్లు తదితరవి కల్పించారు. దేవస్థానం అన్నదాన భవనం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులను అలరించేందుకు ఆలయ పుష్కరిణి వద్ద, భ్రామరీ కళావేదిక వద్ద, శివదీక్షా శిబిరాల వద్ద పలు కన్నడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే స్వామిఅమ్మవార్ల కై ంకర్యంలో భాగంగా గ్రామోత్సవంలో కోలాటం, చెక్క భజన, వగటివేషాలు, బుట్టబొమ్మలు, కన్నడ ప్రాంత డోలు వాయిద్యాలు మొదలైన జానపద కళారూపాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుకభాగం, యజ్ఞవాటిక, ఔటర్‌రింగ్ రోడ్డు మొదలైనచోట్ల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ప్రైవేట్ బస్సులకు గ్యాస్ గోడౌన్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.



క్షేత్రంలో ఏర్పాటు చేసిన షైప్ పెండాల్స్



ఉచిత, శీఘ్ర దర్శన క్యూలైన్లు

అన్ని వ్యాధుల పరీక్షలూ ఒకేచోట

సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి



దయాగ్నోస్టిక్ బ్లాక్‌ను పరిశీలిస్తున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇక నుంచి అన్ని రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు ఒకేచోట చేసేలా భవన నిర్మాణం పూర్తయ్యిందని, త్వరలో దీనిని ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. నూతన వ్యాధినిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. త్వరగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రంలో సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ల్యాబ్ ఇన్వెస్టిగేషన్స్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర పరీక్షలను ఒకేచోట ఉంచనున్నట్లు తెలిపారు. క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్లెన్న జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిస్ట్ గదులను, రక్తనిధిని పరిశీలించారు. మానసిక విభాగం ఓపీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపి(ఈసీటీ) మిషన్ అందుబాటులో ఉన్నప్పుడు ఎందుకు కేసులు చేయడం లేదని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

వేసవిలో కూరగాయల సాగు లాభదాయకం

- విత్తన మోతాదు పెంచాలి
- కీలక దశలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయులు సూచనలు


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ ఏడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో కూరగాయల సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు తెలిపారు. వర్షాకాలంలో సాగు చేసే కూరగాయలన్నిటినీ వేసవిలో సాగు చేయవచ్చన్నారు. అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ (సంకర జాతి) వంగడాలను ఎన్నుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. కీలక దశలో నీటి ఎద్దడి లేకుండా బావులు, బోర్లు ఇతర నీటిపారుదల కింద సాగు చేపట్టాలన్నారు. వేసవిలో కూరగాయల కొరత ఉంటుందని, ఈ సమయంలో పండించిన పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. వేసవిలో కూరగాయల సాగుకుపై సూచనలు ఆయన మాటల్లోనే..

" వేసవిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా మొక్కల పెరుగుదల తక్కువగా ఉంటుంది. పూత, పిందె తగ్గి, దిగుబడులు తగ్గుతాయి. మొక్కలను దగ్గరదగ్గరగా తక్కువ దూరంలో నాటుకోవాలి. మొక్కల సాంద్రత పెంచితే ఒక మొక్క ద్వారా దిగుబడి తగ్గినప్పటికీ ఎక్కువ సంఖ్యలో మొక్కలు ఉండటం వల్ల దిగుబడి తగ్గకుండా ఉంటుంది. వేసవిలో కూరగాయలు సాగు చేసే రైతులు విత్తన మోతాదును పెంచాలి. బెండ ఖరీఫ్‌లో ఎకరానికి 4 కిలోలు వాడితే వేసవిలో ఆరు కిలో విత్తనం వాడాలి. రబీలో టమాటాకు 60 ఇంటు 45 సెంటీమీటర్ల దూరంలో మొక్కలు నాటితే వేసవిలో 45 ఇంటు 30 సెంటీమీటర్ల దూరంలో నాటుకోవాలి.

- సాధ్యమైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాడితే భూమిలో తేమను పట్టి ఉంచే గుణం పెరుగుతుంది. సూక్ష్మ జీవుల చర్య పెరిగి పోషకాల లభ్యత పెరుగుతుంది.
- జీవన ఎరువులైన అజటోబాక్టర్, ఫాస్ఫో బాక్టీరియా ఎకరానికి 2 కిలోల చొప్పున వాడితే సిఫారసు చేసిన నత్రజని, భాస్వరం ఎరువులు 25 శాతం ఆదా చేయవచ్చు. అంతే కాకుండా మొక్క పెరుగుదలకు అవసరమైన హార్మోన్లు కూడా అందుతాయి.
- మొక్క పెరుగుదల దశలో 30, 45, 75 రోజులకు 2 శాతం యూరియా ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేస్తే నత్రజని ఆదాతో పాటు నీటి ఎద్దడిని తట్టుకునే వీలుంటుంది.
- ప్రతి 9 కిలోల యూరియాకు ఒక కిలో వేప పిండి లేదంటే 25 కిలో యూరియాకు ఒక కిలో వేపనూనె కలిపి అరగంట సేపు ఆరబెట్టి వేస్తే ఎంత వేడికైనా యూరియా ఆవిరి కాకుండా ఎక్కువ కాలం మొక్కకు అందుబాటులో ఉంటుంది.
- వేసవిలో టమాటలో కాయ పగుళ్లు, సైజు తగ్గడం, కాయ కింద కుళ్లు మొదలైన సమస్యలు బోరాన్, కాల్షియం లోపం వల్ల వస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల బోరాక్స్ కలిపి పూత, పిందె దశలో రెండు సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేయాలి. కాయ కింద కుళ్లు నివారణకు కాల్షియం నైట్రేటు 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పూతకు ముందు పిచికారీ చేయాలి.
- ఉష్ణోగ్రతల వల్ల ఆకుల నుంచి నీరు ఎక్కువగా ఆవిరవుతుంది. మొక్క పెరుగుదల, దిగుబడుల మీద ప్రభావం చూపుతాయి. నేల స్వభావం పంటను బట్టి, కీలక దశలో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త తీసుకోవాలి."

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం కర్నూలు నగరానికి చెందిన కుప్ప రాజేశ్వరి, శ్రీనివాసుల దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

బైక్ నుంచి పడి వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఎర్రబురుజు ప్రాంతానికి చెందిన శివ (34) అనే వ్యక్తి బైక్ మీద నుంచి కింద మృతి చెందాడు. వృత్తిరీత్యా ఆటోడ్రైవర్ అయిన శివ శుక్రవారం తెల్లవారుజామున అజీర్తిగా ఉందని ఇంట్లో చెప్పి బైక్‌పై రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ జీరా తాగి వస్తుండగా ఆర్ఎస్‌రోడ్డు సర్కిల్ వద్ద బైకు మీద నుంచి కింద పడ్డాడు. స్థానికులు చూసి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతునికి భార్య సునీత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేకపిల్ల తెచ్చిన తంటా

- దాయాదుల మధ్య ఘర్షణ.. ఇద్దరికి గాయాలు


గాయపడిన వ్యక్తి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న, చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి

వెల్దుర్తి: మేకపిల్ల ఆటో కిందకు దూరడం, అది లించిన సందర్భంగా మాటా మాటా పెరిగి దాయాదుల మధ్య గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. కొసనాపల్లె గ్రామానికి చెందిన రాందాసు, సుధాకర్ దాయాదులు. రాందాసుకు చెందిన మేకపిల్ల వారి ఇళ్ల వద్ద ఉన్న ఆటో కిందకు దూరింది. మేకపిల్లను అదిలించడానికి సుధాకర్‌కు చెందిన కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నాన్ని తప్పుగా అర్థం చేసుకున్న రాందాసు వాగ్వాదానికి దిగాడు. అక్కడకు చేరుకున్న సుధాకర్‌తో మాటామాట పెరిగింది. ఈ క్రమంలో రాందాసు కొడవలితో సుధాకర్‌పై దాడి చేశాడు. సుధాకర్ తలకు గాయాలయ్యాయి. సుధాకర్ కుటుంబీకుల దాడిలో రాందాసు సైతం గాయపడ్డాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఇరువర్గాల వారు పోలీసుల నాశ్రయించనున్నట్లు తెలిసింది.

సర్వేయర్లు నిర్లక్ష్యం వీడాలి

- సరిహద్దు రాళ్లు పకడ్బందీగా ఏర్పాటు చేయండి
- 25వ తేదీలోగా ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం పూర్తి కావాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: మండల సర్వేయర్లు నిర్లక్ష్యం వీడి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పీజీఎల్ఆర్ రీ సర్వే, ఫారం-6బీ, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి నిర్దేశిత గడువులోగా సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరామను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో మండల సర్వేయర్లపై ఆరోపణలు వస్తున్నాయని, పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలకు రీ సర్వే ప్రక్రియపై పూర్తిస్థాయి శిక్షణ, అవగాహన ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న 4,88,440 మంది ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు పోలింగ్ కేంద్రాల వారిగా బూత్ స్థాయి అధికారులకు రోజువారీ లక్ష్యాలను కేటాయించి లక్ష్య సాధనపై ప్రతిరోజు సాయంత్రం నివేదికలను తనకు అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని మండలాల్లో ఫారం-6బీ పూర్తి చేసి వారం రోజుల్లో 85 శాతానికి రావాలన్నారు. ప్రగతి తక్కువగా ఉన్న మండలాలతో ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించి తహసీల్దార్లు ప్రతిరోజు దృష్టి పెట్టి బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా కౌంటర్ ఫైల్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, ఎం.దాసు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పట్టభద్రుల పోరు

- ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు ఉత్కంఠగా మారాయి. ఇప్పటివరకూ 9 రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం సాధించాలి. కానీ తొలి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుంది. శుక్రవారం రాత్రి 11.15 గంటలకు 9వ రౌండు ఓట్లలెక్కింపు పూర్తయ్యింది. ఇప్పటి దాకా వెన్నపూస రవీంద్రారెడ్డికి 84,153 ఓట్లు, టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డికి 82,740 ఓట్లు వచ్చాయి. వెన్నపూస 1,413 ఓట్ల మెజారిటీలో ఉన్నారు. మరో రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం కన్పించలేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళితే ఫలితం శనివారం మధ్యాహ్నం తేలే అవకాశం ఉంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,45,576 ఓట్లు పోలవగా.. ఇప్పటి వరకూ 2,16,014 ఓట్లను లెక్కించారు. అందులో 16,976 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మిగతా 1,99,038 ఓట్లను పరిగణనలోకి తీసుకున్నారు.

జగనన్న కాలనీల్లోని గృహాలకు ఉచితంగా మీటర్లు

ఆదోనిఅర్బన్: జగనన్న కాలనీలో ఉన్న గృహాలకు విద్యుత్ మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేస్తామని ఎస్ఈ ఉమాపతి అన్నారు. స్థానిక డీఈ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహాలకు మీటర్లు, వైర్లు, బోర్డులు ఉచితంగా విద్యుత్ శాఖనే ఏర్పాటు చేస్తుందన్నారు. లబ్ధిదారులు ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు వ్యవసాయం కోసం 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఇబ్బంది ఉన్న రైతులు తమ దృష్టికి తీసుకొని వస్తే ఉచిత విద్యుత్ సమయ వేళలు మార్పు చేస్తామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎవరికైనా అధిక లోడు అవసరమైతే ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖకు రూ.2,800 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ఆదోని ప్రాంతంలో నూతన పంట సాగు విధానాలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చే 19 మండలాల్లో వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి నూతన పంట సాగు విధానాలను అమలు చేయాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. నూతన వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా రైతుల ఉత్పాదకతను పెంచి, కరువును నివారించవచ్చన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్, డబుల్ క్రాపింగ్ వంటి నూతన సాగు విధానాలను రైతుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. క్లస్టర్ వారీగా నూతన పద్ధతులను పాటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గుర్తించిన బీడు భూముల్లో డ్రిప్ ,స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి పశుగ్రాసాల పెంపకానికి చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపీ పీడీని ఆదేశించారు. తుంగభద్ర నదీ పరివాహక మండలాల్లో ఫాంపాండ్స్ తవ్వించాలన్నారు. సూక్ష్మ సేద్యం కింద ఉద్యాన పంటలు సాగు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో ఒక ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటరు ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ హౌస్ టెక్నాలజీ కింద సన్న, చిన్న కారు రైతులు హైవాల్యు పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, మత్స్యశాఖ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని వృద్ధురాలి మృతి


మృతి చెందిన అంబమ్మ

ఆలూరు రూరల్: బొలెరో వాహనం ఢీకొని అంబమ్మ (70) అక్కడికక్కడే మృతి చెందింది. ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలోని హైవే-167లో శుక్రవారం రాత్రి 9 గంటలకు ప్రమాదం జరిగింది. నేషనల్ హైవే ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన బొలెరో వాహనం (ఏపీ 04 టీఎస్ 7171) ఢీకొట్టడంతో వృద్ధురాలు మృత్యువాత పడింది. గ్రామస్తులు వాహనాన్ని వెంబడించి హాలహర్వి సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. హాలహర్వి పోలీసులు సరిగా స్పందించలేదని ఆరోపిస్తూ అగ్రహారం గ్రామంలో శవంతో ధర్నా చేపట్టారు. దీంతో మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. కారు డ్రైవర్‌ను ఆలూరు పోలీసులు అదుపులో తీసుకున్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: స్థానిక ఎల్లమ్మ గుడి ఆవరణలో జరిగిన తేనెటీగల దాడిలో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం అమ్మవారి పూజల నేపథ్యంలో భక్తులు, మొక్కుబడులు చెల్లించుకునేందుకు వచ్చిన వారు, వారి బంధువులతో ఆలయ ఆవరణ నిండిపోయింది. ఈ క్రమంలో గుడి వెనుక రైలుపట్టాల వద్ద ముళ్ల కంపలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. పొగ వ్యాపించడంతో అక్కడున్న తేనెతుట్టె నుంచి ఈగలు లేచి భక్తులపై దాడిచేశాయి. అక్కడ మొక్కులు చెల్లించుకునే వారి కార్యక్రమంలో డప్పు కొడుతున్న చిన్న పుల్లయ్య, దానుపై గుంపులుగా కుట్టడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

సాక్షి బిజినెస్

శనివారం
18-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	355	57,990
నిఫ్టీ ▲	114	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్డాక్	11,650	▽ 66
డోజోన్స్	31,923	▽ 323
ఎఫ్టీఎస్ఈ 100	7,335	▽ 75
డాక్స్	14,768	▽ 199
షాంఘై	3,251	▲ 24
నికాయ్	27,334	▲ 323

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (24 క్యారట్)	58,882	▽ 121
బంగారం (22 క్యారట్)	58,646	▽ 120
వెండి (కేజీ)	71,576	▽ 523

బిస్లరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20–25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15–20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.



ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రొపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్ఎస్ 160, ఎన్ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్ఎస్ 200 మోడల్ 18.75 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్ఎస్ 160 మోడల్ 14.6 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.



బిగ్'సి' ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. "ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి" అని బాలు చౌదరి కోరారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-2-2023	
విశాఖ	450–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.95

ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది.


మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.



ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు

ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 408 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్థంలో కనిష్టస్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిచిన భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



రాహుల్

- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



మార్ష్

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1–5, 2–77, 3–129, 4–139, 5–169, 6–174, 7–184, 8–184, 9–188, 10–188. **బౌలింగ్:** షమీ 6–2–17–3, సిరాజ్ 5.4–1–29–3, పాండ్యా 5–0–29–1, శార్దుల్ 2–0–12–0, జడేజా 9–0–46–2, కుల్దీప్ 8–1–48–1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1–5, 2–16, 3–16, 4–39, 5–83. **బౌలింగ్:** స్టార్క్ 9.5–0–49–3, స్టొయినిస్ 7–1–27–2, అబాట్ 9–0–31–0, గ్రీన్ 6–0–35–0, జంపా 6–0–37–0, మ్యాక్స్‌వెల్ 2–0–7–0.



జడేజా

గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి – ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21–14, 18–21, 21–12 స్కోరుతో లీ వెన్ మీ – ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి – ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి – ట్రెసా 6–2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6–6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11–8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18–12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి – ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8–1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11–4..13–5..15–8..18–10...ఇలా సాగింది. 20–12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా – లీ సా హితో గాయత్రి – ట్రెసా తలపడతారు.



జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా అంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు అంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5–0 స్కోరుతో ఎంవాంగీ టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0–5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



శశి

ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.